క్లుప్తంగా...

కేంద్ర మంత్రిని కలిసిన కార్పొరేటర్


మంత్రి ప్రహ్లాద్ జోషితో కార్పొరేటర్ శ్రీనివాస్

రాజేంద్రనగర్: నగరంలో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరైన కేంద్ర బొగ్గు, గనుల శాఖల మంత్రి ప్రహ్లాద్ జోషిని శుక్రవారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ మంత్రిని మర్యాదపూర్వకంగా డివిజన్ పార్టీ నాయకులతో కలిసి పలు విషయాలపై చర్చించినట్లు వెల్లడించారు. డివిజన్ పార్టీ అధ్యక్షులు జనార్దన్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజేంద్రనగర్‌లో భారీ వర్షం

సాక్షి,సిటీ బ్యూరో : నగరంలోని రాజేంద్రనగర్‌లో భారీ వర్షం కురిసింది. శుక్రవారం రెండు, మూడు ప్రాంతాలు మినహా మిగతా ప్రాంతాల్లో చిరుజల్లులు కురిశాయి. రాజేంద్రనగర్ ఏఆర్ఎస్ ప్రాంతంలో కుండపోత వర్షంతో సుమారు 8.1 సెంటీమీటర్ల వర్షం నమోదు కాగా, అదే ప్రాంతంలోని జీహెచ్ఎంసీ ఆఫీస్ పరిసరాల్లో మాత్రం 1.8 సెంటీ మీటర్ల వర్షపాతం పరితమైంది.

శాకంబరిగా ఎదురుగడ్డ మైసమ్మ

రాయదుర్గం: మధురానగర్ ఎదురుగడ్డ మైసమ్మ అమ్మవారు శుక్రవారం శాకంబరిగా దర్శనం ఇచ్చారు. ఆషాఢమాసం ఉత్సవాలలో భాగంగా అమ్మవారికి 11 రకాల కూరగాయలతో ప్రత్యేకంగా అలంకారం చేశారు. ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ప్రజెంటేషన్‌లో భాష కీలకం

- మనూ వీసీ సయ్యద్ ఐనుల్ హసన్

రాయదుర్గం: ప్రజెంటేషన్‌లో భాష కీలకపాత్ర పోషిస్తుందని మనూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ నిర్వహించిన ఒకరోజు జాతీయ సెమినార్ కమ్ వర్క్‌షాప్ ' ది ఆర్ట్ ఆఫ్ ప్రజెంటేషన్'లో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాన వ్యక్తిత్వ వికాసానికి, భాషా ప్రసారాన్ని సమర్థవంతంగా ఉపయోగించడంలో కమ్యూనికేషన్ నైపుణ్యాలు చాలా ముఖ్యమైనవని, విజయవంతమైన ప్రదర్శనకు కీలకమన్నారు. స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ ట్రెనింగ్ డీన్, ఓఎస్‌డీ-2 ప్రొఫెసర్ సిద్దిఖీ మోహ్మద్ మహమూద్ మాట్లాడారు. కార్యక్రమంలో ఉర్దూ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్, ప్రొఫెసర్లు ముస్తాక్ అహ్మద్ పటేల్, స్మితారాణి, డాక్టర్ తయ్యబానజ్లీ, డాక్టర్ పర్వీన్‌కుమార్ పాల్గొన్నారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

గచ్చిబౌలి: ఔటర్ రింగ్‌రోడ్డుపై వాహనం ఢీకొన్న ఘటనలో వ్యక్తి మృతి చెందిన సంఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ శోభన్‌బాబు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నానక్‌రాంగూడ రోటరీ వద్ద ఔటర్‌పై శుక్రవారం తెల్లవారుజామున 2.30 గంటల సమయంలో నడుచుకుంటూ వెళుతున్న వ్యక్తి(50 నుంచి 55)ని వాహనం ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. 108 అంబులెన్స్‌లో ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు అక్కడి వైద్యులు ధృవీకరించారు. సంబంధిత వ్యక్తులెవరైనా ఉంటే 9490617127 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని పోలీసులు సూచించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

హత్యాయత్నం కేసులో మూడేళ్లు జైలు, జరిమానా

గచ్చిబౌలి: సోదరిని హత్య చేయబోయిన కేసులో సోదరుడికి కూకట్‌పల్లి కోర్టు మూడు సంవత్సరాల జైలు శిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మియాపూర్‌లోని నడిగడ్డతండాకు చెందిన పత్లావత్ రవీందర్(28), సోదరి సోని, తల్లిదండ్రులతో కలిసి నివాసముంటున్నారు. సోని తన భర్తతో మనస్పర్థల కారణంగా తల్లిదండ్రుల వద్దే ఉంటుంది. ఈ క్రమంలో సోని, సోదరుడు రవీందర్‌ల మధ్య తరచు గొడవలు జరుగుతుండేవి. సోనీని ఎలాగైనా ఇంట్లో నుంచి వెళ్లగొట్టాలని ప్రయత్నించాడు.వీలుకాకపోవడంతో ఆమెను ఎలాగైనా చంపాలనే ఉద్దేశంతో 2022 మార్చి 18వ తేదీ మధ్యాహ్నం సోనితో గొడవపడ్డాడు. బయటికి లాక్కొని వచ్చి బండరాయితో చంపడానికి ప్రయత్నించాడు. ఆమె తప్పించుకునే ప్రయత్నంలో కుడికాలిపైన రాయి పడడంతో గాయపడింది. వెంటనే తల్లిదండ్రులు కొండాపూర్ ఆసుపత్రిలో చేర్పించారు. తర్వాత మెరుగైన చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అనంతరం సోని మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. విచారణ పూర్తయిన తర్వాత కోర్టులో చార్జీషీటును దాఖలు చేయగా కూకట్‌పల్లి కోర్టు సీనియర్ సివిల్ జడ్జి వి.శ్రీనివాస్‌రావు సాక్షులను విచారించి రవీందర్‌కు మూడు సంవత్సరాల జైలుశిక్ష, జరిమానాను విధించినట్లు పోలీసులు తెలిపారు.

లక్షల కోట్ల అభివృద్ధి అంతా కేంద్రానిదే

కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి


ఫ్లైఓవర్ పనులను పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి

శంషాబాద్ : గత తొమ్మిదేళ్లుగా తెలంగాణ రాష్ట్రంలో లక్షలాది కోట్ల రూపాయల అభివృద్ధి పనులను కేంద్ర ప్రభుత్వం చేపట్టిందని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాలు, బొగ్గుగనుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి అన్నారు. తెలంగాణ రాష్ట్ర సర్కారు పూర్తిగా తప్పుడు లెక్కలు చెబుతుందని ఆయన వివరించారు. మహాసంపర్క్ అభియాన్‌లో భాగంగా శుక్రవారం ఆయన శంషాబాద్ పట్టణంలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అంబేద్కర్ చౌరస్తా వద్ద శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం బస్టాండ్ ఆవరణలో మొక్కలు నాటి ఫ్లైఓవర్ పనులను పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లాడారు.. తెలంగాణ రాష్ట్రం నుంచి పన్నుల రూపంలో వచ్చిన దానికి మూడింతలు అదనంగా కేంద్ర సర్కారు తెలంగాణ రాష్ట్రాభివృద్ధికి ఖర్చుచేశామన్నారు. కేంద్రానికి సంబంధించిన ఫసల్‌భీమా యోజన, ఆవాస్‌యోజన వంటి అనేక సంక్షేమ పథకాలను రాష్ట్ర సర్కారు అమల్లోకి రాకుండా అడ్డుకుంటున్నాయన్నారు. నలభై లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరేలా కేంద్ర ప్రభుత్వం ఎరువులను సబ్సిడీకి అందించిందన్నారు. కుటుంబపాలన నుంచి విముక్తి పొంది సంక్షేమ పాలన వైపు తెలంగాణ రాష్ట్ర రావాలంటే ప్రజలు బీజేపీకి పట్టం కట్టాలని ఆయన అన్నారు. లిక్కర్ కేసులకు సంబంధించి మీడియా అడిగి ప్రశ్నలకు చట్టం తన పని తాను చేస్తోందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే లక్ష్మీనారాయణ, జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, రాష్ట్ర నాయకులు డాక్టర్ ప్రేమ్‌రాజ్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు బైతి శ్రీధర్ , మహేందర్, కె. ప్రశాంత్, వై. శ్రీదర్, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని సందర్శించిన వరల్డ్ బ్యాంక్ ఎఫ్ఏఓ


పవర్ ప్రజెంటేషన్ ద్వారా వివరిస్తున్న అధికారులు

ఏజీవర్సిటీ : వరల్డ్ బ్యాంక్ ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఏఓ) ఎకనామిక్ డెవలప్మెంట్ కన్సల్టెంట్ డాక్టర్ పోలియా కోవ్ శుక్రవారం రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. ఇంచార్జి రిజిస్ట్రార్ వెంకటరమణ ఇతర విశ్వవిద్యాలయ అధికారులతో సమావేశమయ్యారు. విశ్వవిద్యాలయంలో విద్య, పరిశోధన,విస్తరణలతో సాధించిన ప్రగతి చేపడుతున్న కార్యక్రమాలు, అనుబంధ విభాగాల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. వ్యవసాయ రంగంలో జరుగుతున్న మార్పులు, జరగబోతున్న అంశాల గురించి చర్చించారు. ప్రధానంగా వాతావరణ మార్పులు, ప్రభావాలు వాటిని ఎదుర్కోవడానికి సంసిద్ధత,టెక్నాలజీ వ్యాప్తి వాటి గురించి చర్చించారు. అనంతరం వ్యవసాయ కళాశాలలో ఏర్పాటుచేసి ఏవీఆర్ ల్యాబ్‌ను సందర్శించారు.

అనాథలను ఆదరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ శిల్పవల్లి

మణికొండ: అనాథలను చేరదీసి విద్యాబుద్ధులు చెప్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మాదాపూర్ డిప్యూటీ కమీషనర్ ఆఫ్ పోలీస్ శిల్పవల్లి అన్నారు. నార్సింగి మున్సిపాలిటీ, వట్టినాగులపల్లిలోని సేవ్ అవర్ సోల్(ఎస్ఓఎస్) సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ హెర్మన్ మైనర్ 104 జయంతిని పురస్కరించుకుని శుక్రవారం బాలల గ్రామంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ బాలలను ఓ కుటుంబ వాతావరణంలో పెంచటం, వారికి ఉత్తమ విద్యాబోధన చేయటం హర్షణీయమన్నారు. సమాజంలో కొనసాగుతున్న అనేక సంస్థలు ఇలాంటి సంస్థను ఆదర్శంగా తీసుకుని అనాథల పట్ల కృషి చేయాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ డి.రేఖయాదగిరి, ఎస్‌సీపీసీఆర్ మెంటర్ రాగజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయవర్సిటీతో 'దక్కన్‌ముద్ర' ఒప్పందం


ఒప్పందాలపై సంతకాలు చేసి మార్చుకుంటున్న అధికారులు

ఏజీవర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం రూపొందించిన తెలంగాణ సోన వరి రకం బియ్యానికి సంబంధించి విశ్వవిద్యాలయంతో గతంలో చేసుకున్న అవగాహన ఒప్పందాన్ని దక్కన్ ముద్ర సంస్థ రెన్యువల్ చేసుకుంది. విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ వెంకటరమణ, దక్కన్ ముద్రా సంస్థప్రతినిదులు ఒప్పందాలపై సంతకాలు చేసి మార్చుకున్నారు. విశ్వవిద్యాలయం ఉన్నతాధికారులు, వరి పరిశోధన విభాగం శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలి


పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అధికారులకు సూచించారు. శుక్రవారం ఆయన టోలిచౌకి, నానల్‌నగర్, గోల్కొండ డివిజన్‌లలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న వరద నీటి పైప్‌లైన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి కావడం లేదని, దీనికి సంబంధిత అధికారులు బాధ్యత వహించాలని అన్నారు. వర్షాలకు మట్టికుప్పలు కాస్తా బురద గుంటలుగా మారాయని ఆయన అన్నారు. వృథాగా పడి ఉన్న మట్టి కుప్పలు అవసరం లేకపోతే వెంటనే వాటిని తరలించాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, టోలిచౌకి కార్పొరేటర్ ప్రతినిధి హారూన్‌ఫరాన్, జలమండలి డీజీఎం ఖాజా జవహర్‌అలీ తదితరులున్నారు.

ఇంటర్నేషనల్ ఒలింపిక్ రన్ ప్రారంభం



ఒలింపిక్ రన్‌ను ప్రారంభిస్తున్న వీహెచ్

సుల్తాన్‌బజార్: విద్యతో పాటు క్రీడలను అందిస్తున్న ఘనత హనుమాన్ వ్యాయామశాలకే చెందుతుందని మాజీ ఎంపీ, హనుమాన్ వ్యాయామశాల అధ్యక్షుడు వి.హన్మంతరావు అన్నారు. శుక్రవారం సుల్తాన్‌బజార్ హనుమాన్ టేక్డిలోని హెచ్‌వీఎస్ ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ ఒలింపిక్ రన్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా వీహెచ్ హాజరై కాగడా జ్యోతిని వెలిగించి జెండా ఊపి రన్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... హనుమాన్ వ్యాయామశాల విద్యాసంస్థకు ఎంతో చరిత్ర ఉందని, విద్యతో పాటు క్రీడలను ప్రోత్సహిస్తూ ఎంతో మంది జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను అందించిన ఘనత హనుమాన్ వ్యాయమశాలకు ఉందన్నారు. ఈ ఒలింపిక్ రన్ హనుమాన్ టేక్డి నుంచి అబిడ్స్ మీదుగా ఎల్బీస్టేడియం వరకు సాగింది. హనుమాన్ వ్యాయామశాల కార్యదర్శి మైథిలి శరణ్, లక్ష్మణ్, కిషన్, ప్రత్యూష్, విశాల్, మల్లేష్‌యాదవ్, జయరాజ్ యాదవ్, వెంకటేష్ పాల్గొన్నారు.

డ్రైనేజీని ఆక్రమించి నిర్మాణం

రాజేంద్రనగర్: రోడ్డును ఆక్రమించడంతో పాటు మ్యాన్‌హోల్‌లోనే పిల్లర్ వేసి నిర్మాణాన్ని చేపడుతున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలంటూ రాజేంద్రనగర్ ఎన్ఐఆర్‌డీ ప్రాంతానికి చెందిన శివకుమార్ శుక్రవారం రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ ఎన్ఐఆర్‌డీ రిజిస్ట్రేషన్ కార్యాలయం ప్రాంతంలో కొత్తగా ఓ వ్యక్తి నిర్మాణాన్ని చేపడుతున్నాడన్నారు. తనకు ఉన్న స్థలం కంటే అధికంగా రోడ్డును, రోడ్డుపై ఉన్న డ్రైనేజీ మ్యాన్‌హోల్‌ను ఆక్రమించి నిర్మాణాన్ని ప్రారంభించాడని ఆరోపించారు. డ్రైనేజీ మ్యాన్‌హోల్‌లను తొలగించి అందులోనే పిల్లర్ వేశాడన్నారు. ఈ విషయమై తాము ప్రశ్నించిన స్పందించకుండా నిర్మాణాన్ని కొనసాగిస్తున్నాడన్నారు. ఇదే విషయాన్ని ఉప కమీషనర్‌తో పాటు టౌన్‌ప్లానింగ్ అధికారికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. వెంటనే నిర్మాణాన్ని ఆపి డ్రైనేజీ మ్యాన్‌హోల్‌ను ఏర్పాటు చేయాలన్నారు.

గో వధ నిషేధ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలి

సుల్తాన్‌బజార్: దేశంలో గో వధ నిషేధ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని, అయితే కొంతమంది గో రక్షణ పేరుతో గోవులను అమ్మేస్తున్న మాఫియాపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని యూత్ ఖురేషి కమ్యూనిటీ సంస్థ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు శుక్రవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సంస్థ తెలంగాణ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు మహ్మద్ మన్సూర్ చౌదరి, నాయకులు ఖలీద్ హసీన్‌ఖురేషి, అతిక్ ఖురేషి, జావేద్, బషీర్‌లు తదితరులు మాట్లాడారు. నగరానికి గోవులను తరలిస్తున్న కొందరు ఆ గోవులను ఏ ప్రభుత్వ గోశాలలకు పంపిస్తున్నారని ప్రశ్నించారు. కొందరు డబ్బు సంపాదించుకోవడానికి స్మగ్లింగ్ మాఫియాగా ఏర్పడి నగరానికి పశువులను తరలిస్తున్న వాహనాలను నిలిపివేసి దోచుకుంటున్నారన్నారు. ఇప్పటికైనా జంతు సంరక్షణ చట్టాన్ని కఠిన అమలు చేయడంతో పాటు గో సంరక్షణ పేరిట గోవులను విక్రయిస్తే అక్రమ దందాలకు పాల్పడుతున్న వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఫీజుల పేరుతో విద్యార్థులకు వేధింపులు తగదు

నాంపల్లి: ఫీజుల పేరుతో వేధింపులకు గురిచేస్తున్న శ్రీ చైతన్య, నారాయణ వంటి విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ డిమాండ్ చేశారు. శుక్ర వారం పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ లింగయ్య, ఇంటర్మీడియట్ విద్యా శాఖ సంయుక్త సంచాలకులు జయేశ్వరికి వినతిపత్రం ఇచ్చారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల్లో పుస్తకాలు, డ్రెస్‌లు, బూట్లు పేర్లతో వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, ఏకరూప దుస్తులు అందించాలని కోరారు.

అధికారంలోకి రానున్నది కాంగ్రెస్ పార్టీనే


సమావేశంలో మాట్లాడుతున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్

బండ్లగూడ: కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్ఎస్‌లు ఎన్ని జిమ్మిక్కులు చేసిన రానున్న ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం తప్పక చెబుతారని టీపీసీసీ ప్రదాన కార్యదర్శి బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ తెలిపారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేటర్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు అద్నాన్ సాధిఖ్ ఆధ్వర్యంలో పీఅండ్‌టీ కాలనీలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. స్థానికంగా ఉన్న ముస్లిం పెద్దలతో సమావేశమైయ్యారు. కాంగ్రెస్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. అలాగే రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత చేయనున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా ముస్లిం పెద్దలను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

విద్యానగర్‌లో విద్యుత్ మరమ్మతు పనులు


విద్యానగర్‌లో విద్యుత్ మరమ్మతు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ చంద్రశేఖర్

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ ఒకటో వార్డులోని విద్యానగర్‌లో కరెంటు కష్టాలను తీరుస్తున్నామని కార్పొరేటర్ తలారీ చంద్రశేఖర్ వెల్లడించారు. ఎన్నో రోజులుగా విద్యానగర్‌లో కరెంటు సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తన దృష్టికి వచ్చిందన్నారు. లోటెన్షన్, స్తంబాలు దూరంగా ఉండి చాలా ఇబ్బంది పడుతున్నారన్నారు. గత 3-4 కౌన్సిల్ సమావేశాల్లో ఈ సమస్యపై చర్చించామన్నారు. విద్యానగర్‌లో విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు ప్రారంభించామన్నారు. ఇందులో భాగంగా మరమ్మత్తు పనులను ప్రారంభించి పూర్తి చేశామన్నారు. ప్రజలకు 24 గంటల విద్యుత్‌ను అందించేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ ఎనలేని కృషి చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్, ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, మేయర్, డిప్యూటీ మేయర్లకు కృతజ్ఞతలు తెలిపారు. నార్సింగి మార్కెట్ కమిటి డైరెక్టర్ కట్ల సాయిబాబాగౌడ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బత్తుల నరేందర్, దస్తయ్య, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

పెంచిన జీతాలను చెల్లించండి


నార్సింగి మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న సీఐటీయు నాయకులు

మణికొండ: మేడే సందర్భంగా మున్సిపల్ కార్మికులకు రాష్ట్ర వ్యాప్తంగా పెంచిన రూ.వెయ్యి జీతాన్ని అమలు చేయాలని సీఐటీయు నాయకులు నార్సింగి మున్సిపల్ కమీషనర్ సత్యబాబును కోరారు. శుక్రవారం జిల్లా ఉపాధ్యక్షుడు జె.రుద్రకుమార్ ఆధ్వర్యంలో ఆయనను కలిసి ఈమేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రుద్రకుమార్ మాట్లాడుతూ ఏపీలో మున్సిపల్ కార్మికులకు రూ.21వేలు కనీస వేతనం, రూ. 6లక్షల ప్రమాద భీమాను రాష్ట్రంలోను అమలు చేయాలన్నారు. గతంలోనే అనేక సార్లు ఆవిషయాన్ని డిమాండ్ చేస్తు అనేక వినతిపత్రాలు అందించటం, ఉద్యమాలు చేసినా ప్రభుత్వం స్పందించటం లేదన్నారు. కనీసం పెంచిన రూ. వెయ్యి జీతం అయినా ఇతర మున్సిపాలిటీల మాదిరిగా వచ్చే నెల నుంచి పెంచి ఇవ్వాలని కమీషనర్‌ను కోరామన్నారు. ఈ కార్యక్రమంలో గండిపేట మండల కన్వీనర్ ప్రవీణ్‌కుమార్, మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు జనార్దన్‌రెడ్డి, మహిపాల్‌యాదవ్, శ్రీనివాస్, వరప్రసాద్, రాజు తదితరులు పాల్గొన్నారు.

చిన్నపాటి వర్షానికే రోడ్లు పూర్తిగా జలమయం


కాటేదాన్‌లో రోడ్లపై నిలిచిపోయిన వరద నీరు

రాజేంద్రనగర్: చిన్నపాటి వర్షాలకే రోడ్లు పూర్తిగా జలమయమవుతున్నాయని భారీ వర్షాలు కురిస్తే ప్రజల పరిస్థితి ఏమిటని భారత కమ్యూనిస్టు పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గ కో-కన్వీనర్ వనంపల్లి జైపాల్‌రెడ్డి అన్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని అత్తాపూర్, రాజేంద్రనగర్, మైలార్‌దేవ్‌పల్లి, సులేమాన్‌నగర్, శాస్త్రీపురంలో ఆయన శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం కురిసిన చిన్నపాటి వర్షాలకు రోడ్లపై నీరు నిలవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. మైలార్‌దేవ్‌పల్లి, కాటేదాన్, ఆరాంఘర్, రాజేంద్రనగర్ అత్తాపూర్ తదితర ప్రాంతాల్లో రోడ్లపై నీరు నిలిచిన కారణంగా వాహనాదారులు, పాదాచారులు అనే అవస్తలు పడ్డారన్నారు. శాంతినగర్‌కు వెళ్లే ప్రాంతంలో రోడ్లు పూర్తిగా మునిగిపోయాయని అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ఈ దుస్థితి నెలకొందని వెల్లడించారు.

ముందస్తుగా ప్రత్యేక డ్రైవ్


రోడ్ల పక్కన ఉన్న మట్టిని తొలగిస్తున్న సిబ్బంది

మణికొండ: రానున్న వర్షాల వల్ల ప్రజలకు కలిగే ఇబ్బందులను ముందుగానే గుర్తించి వాటిని తొలగించేందుకు పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటున్నామని మణికొండ మున్సిపల్ చైర్మెన్ కె.నరేందర్ ముదిరాజ్ పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని రోడ్ల పక్కన పేరుకుపోయిన మట్టి, చెత్తలను తొలగించటంతో పాటు విరిగి పోయిన మ్యాన్ హోళ్లను మార్చటం పనులను ఆయన శుక్రవారం 6వ వార్డులో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లపై ఉండే గోతులను పూడ్చటం, విరిగి పోయి ఉన్న మ్యాన్‌హోల్‌లను మార్చటం చేస్తే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగవనే ఉద్దేశంతో ప్రత్యేక డ్రైవ్‌ను చేపట్టామన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో రోడ్ల పక్కన ఉన్న చెత్త, మట్టి, నిర్మాణ వ్యర్థాలను పూర్తిగా తొలగించాలని సిబ్బందిని ఆదేశించామన్నారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యుడు తాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి


అత్తాపూర్‌లో శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న రాచూరి రాజశేఖర్ తదితరులు


హైదర్‌గూడ చౌరస్తాలో నిర్వహించిన నివాళి కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నాయకులు


రాజేంద్రనగర్‌లో డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీకి నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు

అత్తాపూర్: అత్తాపూర్ డివిజన్ లాల లజపత్‌రాయ్ శక్తి కేంద్రంలో జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి శక్తి కేంద్రం ఇన్‌చార్జి రాచూరి రాజశేఖర్ ఆధ్వర్యంలో డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి(బలిదాన్ దివస్) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటతాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో దుర్గాప్రసాద్, మునిందర్, రందీర్‌సింగ్, యాదయ్య, రఘునందన్, సుందర్, సంతోష్‌వర్మ, బాలాజీరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హైదర్‌గూడ చౌరస్తాలో...

డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్‌ను హైదర్‌గూడ చౌరస్తాలో నిర్వహించారు. అత్తాపూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు సాబాద విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో శ్యామ్‌ప్రసాద ముఖర్జీ చిత్రపటాన్ని ఏ ర్పాటు చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నివాళి

రాజేంద్రనగర్: భారతీయ జనతా పార్టీ రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షులు జె.బాబురావు ఆధ్వర్యంలో రాజేంద్రనగర్‌లోని అంబేద్కర్ చౌరస్తాలో డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ 70వ బలిదాన్ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, డివిజన్ ఎస్సీ మోర్చా అధ్యక్షులు తొండుపల్లి మల్లేష్, ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి ఈ.వేణుగోపాల్ పాల్గొన్నారు.